1

# శుభాభివందనములు మరియు ఉద్దేశము

# (1-4)

## ప్రారంభ శుభాభివందనములు (1, 2)

**[1]యేసుక్రీస్తు దాసుడును, యాకోబు సహోదరుడునైన యూదా, తండ్రియైన దేవునియందు ప్రేమింపబడి, యేసుక్రీస్తునందు భద్రము చేయబడి పిలువబడినవారికి శుభమని చెప్పి వ్రాయునది. [2]మీకు కనికరమును సమాధానమును ప్రేమయు విస్తరించును గాక.**

ఈ పత్రిక యొక్క ప్రారంభ పలుకులు సాధారణ పత్రికలో మనము చదువుచుండు అదే విధమైన పలుకులై ఉన్నాయి. గ్రంథకర్త తనను తాను గుర్తించుకుంటున్నాడు, తన శ్రోతలను సంబోధిస్తున్నాడు, ఆ తరువాత తన శుభాకాంక్షలను తెలియజేస్తున్నాడు.

**వచనము 1.** యూదా తనను తాను **యేసుక్రీస్తు దాసుడును, యాకోబు సహోదరుడునైన యూదా** అని సంబోధించుకుంటూ, తన పత్రిక రచనను ప్రారంభించాడు. ఇచ్చట పేర్కొనబడిన "యాకోబు" ప్రభువు సహోదరుని సూచించడానికి ఆస్కారమున్నది (గలతీయులకు 1:19; యాకోబు 1:1). యేసు యొక్క పరిచర్య ప్రారంభమైన తొలి రోజుల్లో, ఆయన మతి చలించినదని ఆయన సహోదరులు అనుకున్నారు (మార్కు 3:21, 31; యోహాను 7:5), కాని అటుతరువాత ఇదే సహోదరులు ఆయనయందు విశ్వాసముంచారు (అపొస్తలుల కార్యములు 1:14; 1 కొరింథీయులకు 9:5). యూదా మరియు యాకోబు పత్రికలు, అపొస్తలుల కార్యముల గ్రంథములోని సంకేతకమైన మాటలతోను, అపొస్తలికత్వ రచనల అనంతర సాదృశ్యములతోను కలిసి ఉండుట వలన, యేసు కుటుంబము యెరూషలేములోని ఆది సంఘ దైనందిన జీవితంలో, అది గుర్తింపబడిన దాని కంటె యింకా ఎక్కువ ప్రభావము కలిగియుండిన పాత్ర వహించిందని కొందరు తర్కించడానికి అది హేతువయ్యింది.[1]

మత్తయి 13:55లో, సహోదరుల పేర్లు, "యాకోబు యోసేపు సీమోను యూదా అను వారు" అని వ్రాయబడి యున్నది. మార్కు వ్రాసిన సువార్తలో, "యాకోబు, యోసే, యూదా, సీమోను" అని వ్రాయబడి యున్నది (మార్కు 6:3). వెవ్వేరు క్రమంలో నున్న ఈ జాబితాకు గల హేతువేమిటో చెప్పడానికి సంతృప్తికరమైన వివరణ ఏదియు లేదు. యూదా తనను తాను యేసు సహోదరుడుగా గుర్తించుకొనవలసి యుండిందనేది మాత్రం స్పష్టంగా ఉన్నది. ఇది అతడు తనను గూర్చి తాను సాధికారంతో చెప్పుకొనదలచిన దాని కంటె ఎక్కువే అయియున్నదని విదితమగుచున్నది. "యేసుక్రీస్తు దాసుడును, యాకోబు సహోదరుడునై యుండుటతో" అతడు సంతృప్తినొందాడు. అతడు తనను తాను యాకోబుతో కూడ గుర్తించుకొనడం వలన, యూదులైన క్రైస్తవుల ప్రపంచంలో యూదా కంటె యాకోబే ఒక

అధికారిగా ఎక్కువ స్పష్టంగా గుర్తింపబడి యుండెనని సూచిస్తుంది. అట్లయినను, యాకోబు పేరు పేర్కొనబడకపోయినప్పటికిని, కేవలము యాకోబు పేరు పేర్కొనబడుటతో తాను గుర్తింపబడవలెనని యూదా ఆశించాడనేది స్పష్టమవుతుంది. ఆదేశాలను జారీచేయడానికి, అవి పాటింపబడుటకును అతనికి హక్కు ఎందుకుండిందో తన పాఠకులకు వివరించడానికి అతడు ప్రయత్నమూ చేయలేదు.

యూదా తన పాఠకులను సంబోధించిన తీరు అసాధారణమైనదై యున్నది. ఆయన అద్యతన భూతకాలీనమైన రెండు క్రియా పదములను ప్రయోగిస్తున్నాడు. **ప్రేమింపబడి** (*ēgapēmenois*) అనే పదం అక్షరాలా "ప్రేమింపబడుతూ ఉన్న" అనే అర్థమిస్తుంది, మరియు **భద్రము చేయబడి** (*tetērēmenois*) అనే పదం అక్షరాలా "భద్రము చేయబడుతూ ఉన్న" అనే అర్థమిస్తుంది. గ్రీకు భాషలో అద్యతను భూతకాలీనమైన కాలము వాటి ప్రస్తుత స్థానమును తెలియజెప్పుతుంది. యూదా పత్రిక పాఠకులు **తండ్రియైన దేవుని** చేత ప్రేమింపబడుతూ ఉండినవారై యుండిరి. ఇంతేగాక, వారు **యేసుక్రీస్తు** చేత భద్రము చేయబడుతూ ఉండినవారై యుండిరి.

**పిలువబడినవారు** యూదా పత్రిక పాఠకులు దేవునితో కూడా నిశ్చేష్టమైన సంబంధం కలిగియుండిరనే ధ్వనింపు నియ్యదు. కార్యశీలమైన రీతిలో వారు పాల్గొనుట ద్వారా, సువార్తను విని దానికి సుముఖంగా ప్రతిస్పందించుట ద్వారా, వారు "పిలువబడినవారై" యుండిరి. "పిలువబడినవారు అనే పదం క్రైస్తవులకు విధాయకమైన గుణగణముగా అదొక నామముగా నిలిచియుంటుంది, వారు ఆయన ప్రజలై యుండుటకు పిలువబడినవారై యున్నారనియు, అందుకు వారు సుముఖంగా ప్రతిస్పందించారనియు తెలియజెప్పుతుందని ఐ. హోవర్డ్ మార్షల్ వ్యాఖ్యానించాడు (రోమీయులకు 1:6, 7; 8:28; 1 కొరింథీయులకు 1:2, 24; ప్రకటన 17:14తో పోల్చి చూడుము)."[2]

అద్యతన భూతకాలీనమైన కాలమును యూదా ప్రయోగించడం, ప్రభువునందు తన పాఠకులు కలిగియుండిన స్థానములో గ్రంథకర్తకు పూర్తి నమ్మకముండినదని చెప్పడానికి పత్రికలో ఒక తొలి సూచనయై యుంటున్నది. వారు తన నమ్మకములో పాలుపంపులుగలవారై యుండిరి. వారు దేవుని చేత ప్రేమింపబడుతూ, భద్రము చేయబడుతూ ఉండినందువలన, వారికి తెలియజెప్పడానికి ఇటీవల సంఘములోనికి ప్రవేశించిన ఉపదేశకుల యొద్ద ఏమియు లేకుండింది. ప్రత్యక్షత విషయంలో, తన పాఠకులకు ఆదియందు సువార్తనందించిన అపొస్తలిక సాక్షులను మించిన దేనినైనను వారు సాధికారపూర్వకంగా చెప్పలేని స్థితిలో ఉండిరి.

**వచనము 2.** పౌలు పత్రికలలోను, పేతురు రాసిన రెండు పత్రికలలోను మనము చదువుతున్నట్టుగా, సర్వసామాన్యమైన అభివందన పలుకు "కృప" (*charis*)ను యూదా ప్రయోగించలేదు. విశేషంగా **కనికరమును, సమాధానమును, ప్రేమయు విస్తరించును గాక** అనే అభివందన పలుకులను కలుపుతూ తన తోటి విశ్వాసులకు ఆయన తన శుభాకాంక్షలను పొడిగించాడు. "విస్తరించును గాక" (*plēthunō*) అని అనువదింపబడిన పదం పేతురు రాసిన రెండు పత్రికల్లో అగుపించు అదే పదమై యున్నది (1 పేతురు 1:1-2; 2 పేతురు 1:1-3). పదముల ఎంపిక కేవలము భాషాశైలి విషయంలో ఇష్టపూర్వకంగా ఎంపిక చేసికొనబడిందా, లేక ఈ పదమునకు మనము ఏమైనా ప్రాముఖ్యతను ఆపాదించాలా?

పదముల ఎంపికలో గల ప్రాముఖ్యత అనిశ్చయమై యుండగా, మనము కనీసం ఒక విషయం చెప్పుకొనవచ్చు: పత్రిక అంతకంతకు విపులమవుతుండగా యూదా సంబోధించిన సంఘాలు, మనము పేతురు రెండవ పత్రికలో చూచిన అదే విధమైన అబద్ధ బోధకుల చేత కలుగజేయబడిన లోలోపలి అల్లకల్లోలముల మూలాన శ్రమలు అనుభవించుచుండినవనే విషయం స్పష్టమవుతుంది. క్రైస్తవులు అబద్ధ బోధకులతో వ్యవహరించడం కంటె వారికి ఎక్కువ విపత్తు కలుగజేసేవి కొన్ని విషయాలున్నాయి. సమాధాన కర్త యగు ప్రభువు పట్ల అంకితభావంతో నిలిచియుండువారి మధ్య మరియు అన్యోన్య అనురాగసహితమైన సభ్యతగల సమాజంలో అది విపత్తును మరియు అస్తవ్యస్తమును సృష్టిస్తుంది. కనికరము, సమాధానము, మరియు ప్రేమ అనేవి యూదా సంబోధించిన క్రైస్తవులకు అత్యావశ్యకమైవై యుండిన గుణలక్షణములై యుండినవి. గనుక వారిలో ఈ మంచి గుణలక్షణములు విస్తరింపవలెనను తన శుభాకాంక్షను ఆయన వారికి తెలియజేసాడు.

## పత్రిక యొక్క ఉద్దేశమును నిర్వచించుట (వచనములు 3, 4)

**[3]ప్రియులారా, మనకందరికి కలిగెడు రక్షణనుగూర్చి మీకు వ్రాయవలెనని విశేషాసక్తిగలవాడనై ప్రయత్నపడుచుండగా, పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తము మీరు పోరాడవలెనని మిమ్మును వేడుకొనుచు మీకు వ్రాయవలసివచ్చెను.**
**[4]ఏలయనగా కొందరు రహస్యముగా జొరబడి యున్నారు. వారు భక్తిహీనులై మన దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగపరచుచు, మన అద్వితీయనాధుడును ప్రభువునైన యేసు క్రీస్తును విసర్జించుచున్నారు; ఈ తీర్పుపొందుటకు వారు పూర్వమందే సూచింపబడినవారు.**

**వచనము 3.** తన ఉపోద్ఘాతమునకు ఉపక్రమించిన మీదట, యూదా దాదాపు సమర్థనాత్మకమైన వాదయ్యాడు. **మీకు వ్రాయవలెనని విశేషాసక్తిగలవాడనై ప్రయత్నపడుచుండగా** అనంటే, వారికి తన ఉత్తరమును రాయాలని కొంత కాలంగా ఆశించుచుండినట్టు అగుపిస్తుంది. వారు పంచుకొనుచుండిన విశ్వాసంలో వారిని బలపర్చాలనేది, బలముగా కట్టవలెననేది ఆయన ఆతురతయై యుండింది. సార్వత్రికంగా నున్న సంఘమునకు యూదా వ్యక్తిగతంకాని పత్రికను రాయలేదు. తన తలంపుల్లో స్పష్టంగా ఒక నిర్దిష్టమైన శ్రోతలుండినారు. ఏది ఏమైనా, ఎక్కువగా సమాధానపూర్వకమైనవై యున్న విషయాలను అతడు వ్రాయక మునుపు, ఇతర విషయాలు రంగంలోనికి ప్రవేశించాయి. చివరకు అది సంభవించినట్టుగా, ఆయనకు ప్రియమైనవారై యుండిన క్రైస్తవుల విశ్వాసమునకు బెదిరింపై యుండిన ఒక పరిస్థితి గూర్చి సంబోధించాలని అతడు బలవంతం చేయబడుతున్నాడను అనుభూతిని అనుభవించాడు.

**పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధను** యూదా ప్రశంసిస్తున్నాడనే విషయం ప్రాముఖ్యమైనదై యున్నది. దేవుడు తన ప్రజలకు తననుతానే ప్రత్యక్షపర్చుకొనిన విషయమై తర్కించాల్సిన అవసరమున్నదో లేదో అనే తలంపు అతనికి తట్టలేదు. నిస్సందేహంగా, "బోధ" గూర్చి ఆయన ప్రస్తావించినప్పుడు, యూదా మనస్సులో అపొస్తలిక సాక్ష్యములు

మరియు అపొస్తలిక అధికారముతో అందజేయబడిన క్రైస్తవ ఉపదేశములుండినవి. ఇంత కంటె ఎక్కువ ముఖ్యమైన విషయం, అది దేవుడు తనను తానే ప్రత్యక్షపర్చుకొనుట ద్వారా అందజేయబడిన సత్యమును గూర్చిన ఉపదేశమై యుండింది. ఏమి విశ్వసించవలెను, ఎలా ఆరాధించవలెను, లేదా పొరుగువారితో ఎలా వ్యవహరించవలెను మొదలగు విషయాలు క్రైస్తవులు ఎరిగియుండుటకు తోడ్పడుచుండిన మార్గము, దేవుడు తనను తాను ప్రత్యక్షపర్చుకొనడమే. "బోధ" అనే పదమును గూర్చిన యూదా భావము, ఇదే పదం క్రొత్త నిబంధనలోని ఇతర చోట్ల ప్రయోగింపబడిన దానికి కొంచెం భిన్నంగా ఉంటున్నది. మార్షల్ ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు,

> ఈ విధంగా ఇచ్చటి ఉద్ఘాటన విశ్వాసము మరియు నిబద్ధత యొక్క కార్యకలాపమై యుండు విశ్వాసమునకు బదులుగా, విశ్వసింపబడాల్సిన క్రైస్తవ సందేశముపై ఉన్నది, కాని సువార్త స్థానంలో *బోధ* అనే పదము ప్రయోగింపబడుట, విశ్వసించుట యను కార్యకలాపము క్రైస్తవ్యమునకు అంతర్భాగమై యున్నదని సూచిస్తుంది.[3]

లేఖనములలోని దేవుని ప్రత్యక్షత సృష్టికర్తకు మరియు సృష్టికిని మధ్య, మరియు దేవుడు మరియు ఆయన ప్రజలకును మధ్య గోచరమగు జోడింపును సమకూర్చుచున్నది. యూదా యొక్క తొలి పాఠకులకు క్రొత్త నిబంధన అంతయు అందుబాటులో ఉండియుండదు. ఏది ఏమైనా, వారు అపొస్తలుల ద్వారా వారికి దేవుడే ప్రత్యక్షపరచిన వాక్యము గూర్చిన ఎరుకగలవారై యుండిరి. వాక్యము ప్రత్యక్షమై అది క్రొత్త నిబంధన రూపంలో లిఖింపబడి "బోధ" విషయంలో దేవుని జనులకు ఒక మార్గనిర్దేశకము కాక మునుపు కొంత సమయం పట్టింది.

జాన్ స్టాట్ దీనిని ఇలా చక్కగా అభివ్యక్తం చేసాడు: "మనము దేవునితో మాట లాడుటకు మనకు ఏదేని స్వేచ్ఛ లభించక మునుపు దేవుడు మనతో మాటలాడవలెను. మనము అయియున్న దానిని ఆయన దృష్టికి అంగీకారమైన ఆరాధనలో అర్పింపక మునుపు ఆయన ఎవరై యున్నారో ఆయన మనకు తప్పనిసరిగా విడమరచి చెప్పవలెను. దేవునికి అర్పింపబడు ఆరాధన ఎల్లప్పుడు దేవుని వాక్యమునకు ఒక ప్రతిస్పందనయై యుంటుంది."[4] వారి తొలి ఉపదేశకులు మరియు అటుతరువాత వచ్చిన ఉపదేశకులు దేవుని నుంచి వారు పొందిన సందేశమును అందించుచుండిరని సాధికారపూర్వకంగా చెప్పుకొనడం యూదా పాఠకుల సమస్యయై యుండింది, కాని రెండు విభిన్నమైన సందేశములుండినవి. గనుక దేవుని నుంచి కలిగిన సందేశమేదో వారు గుర్తించగలుగునట్లు వారికి యూదా సహాయం చేయదలచాడు.

**మనకందరికి కలిగెడు రక్షణ** గూర్చి ఈ క్రైస్తవులకు రాయాలని యూదా ఇదివరకే ఉద్దేశించినట్లు విదితమగుచున్నది. ఏది ఏమైనా, వారు బోధ నిమిత్తము **పోరాడవలెనని** అధికారపూర్వకంగా కోరుతున్న ప్రస్తుత పత్రిక వ్రాయబడునట్లు పరిస్థితులు అతనిని ప్రేరేపించాయి. **మిమ్మును వేడుకొనుచు మీకు వ్రాయవలసి వచ్చెను** అంటూ రాస్తున్నాడు, యూదా. *Poioumenos* అనే క్రియా విశేషణం విధివిహితం కానిదైయున్నదని పరిగణించినప్పుడు, ఈ అనువాదం, "మనకందరికి కలిగెడు రక్షణ గూర్చి రాయాలని నేను ఆతురతగలవాడనై యుంటిని గనుక …" అంటూ హేత్వర్థకమైనదై యుండుటకు బదులుగా,

"మనకందరికి కలిగెడు రక్షణ గూర్చి రాయాలని నేను ఆతురతగలవాడనై యుండినప్పటికిని" అని అవుతుంది. ఎంతో కొంత అనిష్టంతో యూదా వారికి పత్రికలోని తరువాతి విషయాలు రాసాడనేది సూచనయై యున్నది. ప్రస్తుతానికైతే, యూదా సంబోధించిన క్రైస్తవులు క్రీస్తును వెంబడించుట మానివేసే అపాయకరమైన పరిస్థితుల్లో ఉన్నారు. వారిలో కనీసం కొందరైనా అబద్ధ బోధకుల చేత వంచింపబడ్డారు. వారు తమ విశ్వాస విషయంలో స్థిరపడునంత వరకు క్రైస్తవ కృపలలో అభివృద్ధిచెందే పరిస్థితిలో వారు లేరు. గనుక "వారికందరికి కలిగెడు రక్షణ" గూర్చిన ప్రోత్సాహకరమైన మాటలు రాసి వుంటే యూదా ఎలాంటి ఉత్తరం రాసేవాడో అని మాత్రమే మనము ఊహించుకొనవచ్చు.

ఇతర విషయాలతో పాటుగా, వారి "బోధ" ప్రేరేపింపబడినవారి ద్వారా వచ్చిన క్రైస్తవ ఉపదేశముల నిమిత్తము ప్రయోగింపబడినదై యున్నది. పౌలు ఈ పదమును సామాన్యంగా నమ్మకము అనే అవగాహనతో ప్రయోగించాడు, కాని కొన్ని సందర్భములలో ఆయన "విశ్వాసము" గూర్చి కూడ రాసాడు. పౌలునకు సహితం, అది క్రైస్తవ నమ్మకము మరియు ఆచరణ యొక్క సారాంశమనే అర్థమునీయవచ్చు (గలతీయులకు 1:23-24; 1 తిమోతి 1:2; 3:9; 4:1, 6; 5:8; 6:10, 21; 2 తిమోతి 3:8; 4:7; తీతు 1:13-14). క్రైస్తవ సిద్ధాంతముల సముదాయము, సంఘము యొక్క ఒప్పుకోలు మరియు అభ్యాసము, అపొస్తలికమైన బోధకుల చేత యూదా పాఠకులకు ఉపదేశింపబడినవి. రాబోవుచుండిన దానికి యూదా పునాది వేసాడు. వారికి అందజేయబడిన "బోధ" కనీసం కొంత మేరకైనా, ఎవ్విధంగాను రాజీపడ కూడని నిశ్చితోక్తులై యుండిన సత్యములు మరియు నీతి నియమములకు సంబంధించిన విధివాచకముల రూపంలో ఉండిందని ఆయన ధ్వనించాడు.

పరుగు పందెము నుంచి తీసికొనిన రూపకాలంకారమును ఉపయోగిస్తూ, వారు పొందిన "బోధ నిమిత్తము పోరాడవలెనని" యాకోబు సహోదరుడు తన పాఠకులను బ్రతిమలాడుతున్నాడు. ఈ పత్రిక మున్ముందు విపులమగుచుండగా, వారు ఎట్టి పరిస్థితుల్లోనైనను ముందున్న పేరాగ్రాపుల్లో వర్ణింపబడిన బోధకుల బోధలతో రాజీపడకూడదని ఆయన భావించాడనే విషయం స్పష్టమవుతుంది. వారికి అందజేయబడిన అపొస్తలిక బోధలు సంపూర్ణమైనవై యుండినవి, వారికి పరిపూర్ణమైన మార్గనిర్దేశకమునివ్వగల సమర్థవంతమైనవై యుండినవి. ఇప్పటికే అది సంతోషదాయకం కానిదై యున్నట్టుగా, "మేము కూడ క్రైస్తవ సహోదర సహోదరీలమై యున్నామని" సాధికారంతో చెప్పుకొనెడి వారితో తీవ్రంగా పోరాడవలసి వచ్చినప్పటికిని, క్రైస్తవులు సత్యము విషయంలో నిలదొక్కుకొని యుండాల్సిన సమయం రానేవచ్చింది.

**వచనము 4.** "విశ్వాసం" విషయంలో రాజీపడుచుండినవారు వంచించు మరియు దొంగచాటు మార్గముల సహాయంతో ఏదో ఒక విధంగా క్రైస్తవ విశ్వాసుల గుంపుల లోనికి ప్రవేశించారని స్పష్టమవుతుంది: వారు **రహస్యముగా జొరబడి యున్నారు**. బహుశా వారు ఊరూర తిరిగెడు బోధకులు/ప్రవక్తలు అయియుండవచ్చు. కాని వారు క్రీస్తునంగీకరించక మునుపు సమాజమందిరములతో సంబంధంగల సుదీర్ఘమైన చరిత్రగలవారై యుండవచ్చు క్రైస్తవ సమాజమందిరములు నెలకొల్పబడిన ముందటి కాలములో హెల్లేనీయ ప్రపంచంలో తాత్విక ప్రవాహములలో కొట్టుకుపోవుటకు ఎక్కువ ఇష్టపూర్వకంగా ఉన్ముఖులై

యుండినవారుండిరని స్పష్టంగా తెలుస్తుంది. క్రైస్తవ బోధకులు వచ్చిన తరువాత, వారి సందేశములను హత్తుకొనినవారిలో ఇటువంటివారు మొదటివారై యుండవచ్చు.

ఇట్టి పరిస్థితుల్లో, హెల్లేనీయులకు సంబంధించిన విధానముల పట్ల ఎక్కువ ఉన్ముఖులై యుండిన యూదులు క్రైస్తవ స్వాతంత్ర్యము ఒక నైతిక అనుమతి పత్రమగునట్లు చేయడానికి సహితం సంసిద్ధులై యుండిరనే విషయాన్ని ఒకరు సులభంగా ఊహించుకొనవచ్చు. అయితే వారి విషయంలో గడుపడానికి యూదాకు సమయము లేకుండింది. అబద్ధ బోధకులు **తీర్పు పొందుటకు పూర్వమందే సూచింపబడి యుండిరి**. యూదా వాంగ్మూలము సాధారణమైనదై యుండింది. నిర్దిష్టమైన ఈ బోధకులు వ్యక్తిగతంగా గత కాలమందలి ప్రవచనమునకు సంబంధించిన అంశమై యుండిరని యూదా భావించలేదు. దేవునిని అగౌరవపర్చడానికి వారు జగత్పునాది వేయబడక మునుపటి కాలము నుంచే ముందుగా నిర్ణయింపబడి యుండిరని అంతకన్నా ఉద్దేశించలేదు. విశేషంగా, దేవుని రూపకల్పనను అబద్ధ బోధకులు భంగపరచజాలరనే విషయాన్ని యూదా రూఢిపర్చుతున్నాడు. ఆయన వారి యెడల తగిన చర్య చేపట్టును. అబద్ధ బోధకులు దేవుని ప్రజల్లో నుంచే గత కాలంలో లేచారు. దేవుడు ఎల్లప్పుడు వ్యవహరించిన విధంగానే, ఆయన ఇప్పుడు కూడ వారి నాశనమును నిర్ణయిస్తాడు.

పేతురు రెండవ పత్రికలో వలెనే, అబద్ధ బోధకులు జనసమూహములు వారిని వెంబడించునట్లు, మానవ స్వభావంలో భాగమైన ఇంద్రియ సుఖ సంబంధమైన విషయాలను అత్యంత ఆకర్షణీయమైనవాటిగా మలచారు. 2 పేతురు 2:1-3లోని విషయాలకు సమానాంతరములుగా నున్న సంగతులను గమనించండి: (1) ఒక్కడే అద్వితీయ నాధుడు మరియు ప్రభువునై యున్నవానిని వారు నిరాకరించారు; (2) వారు స్వైరవర్తనమును అభ్యసించారు; (3) వారి నాశనము ఏ నాడో ఏర్పాటుచేయబడింది; (4) మరియు వారు వంచిస్తూ జనాల్లోనికి ప్రవేశించారు.

యూదా "భక్తిహీనుల" గూర్చిన రెండు గుణగణాలపై తన దృష్టిని కేంద్రీకరించాడు. మొదటిదిగా, **మన దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగపర్చారు**. దీనికి తోడుగా, **మన అద్వితీయ నాధుడును ప్రభువునైన యేసు క్రీస్తును విసర్జించుచున్నారని** యూదా చెప్పుతున్నాడు. ఈ బోధకులు సవివరంగా కాదన్నారు లేదా వారి బోధ మరియు ప్రవర్తన బొత్తిగా రాజీపడినదై యుండినదని చెప్పడానికి క్రైస్తవ ఒప్పుకోలునకు అవశ్యకమైన నిశ్చయత ఎంతో కొంత అవసరమై యుండిందని యూదా భావించాడని స్పష్టమవుతుంది. అయితే వారు ఏ విధంగా నిరాకరించారో, యాకోబు సహోదరుడైనవాడు సవిస్తరంగా తెలియజెప్పలేదు. కాని ఒక విషయాన్ని స్పష్టం చేసాడు: యేసే "అద్వితీయ నాధుడు మరియు ప్రభువునై యున్నాడనేది" క్రైస్తవ ఒప్పుకోలునకు ప్రారంభ స్థానమై యున్నది. వ్యక్తిగతంగా విశ్వాసికిని మరియు ప్రజా సమూహమై యున్న ఒక సంఘమునకును, నజరేతువాడైన యేసుకు చెందిన దానిని మించిన ఉన్నతాధికారముగాని, ఉన్నతమైన రాచభక్తిగాని, మరియు ఉన్నతమైన కర్తవ్యపాలనముగాని ఏదియు లేదనేది దీని ధ్వనింపై యున్నది.

"క్రీస్తును 'ప్రభువు' అని సంబోధించడంలో రెండు అంతర్భావములున్నాయి. అదొక *ఒప్పుకోలును*, క్రీస్తు ఎవరై యున్నారో తెలియజెప్పు విశ్వాస సహితమైన వాంగ్మూలమును సూచిస్తుంది. కాని క్రీస్తును 'ప్రభువు' అని పిలువడంలో ఒక *నిబద్ధత* కలదని కూడా

బలముగా ధ్వనించుచున్నది."[5] అబద్ధ బోధకుల వైఖరి, కామాతురతతో కూడిన జీవితం ప్రోత్సహింపబడుట, యేసు యొక్క ఆధిపత్యమును నిరాకరించుట, పట్టించుకోడానికి పైపై విషయాలై యుండినవి. వారు క్రైస్తవ విశ్వాసము యొక్క ప్రాథమిక ఒప్పుకోలు మరియు అది సాధికారంతో కోరుచుండిన జీవిత విధానం విషయంలో రాజీపడ్డారు. గనుక వారికి విరోధంగా యూదా తీవ్రమైన మరియు ఎవ్విధంగాను రాజీపడని మాటలతో కూడిన ఒక జడివానను ప్రవహింపజేసి యుండినట్లయితే, అది వారు అపవిత్రము చేయుచుండిన యేసు నామము గూర్చిన అతని ఆక్షేపణకు సరిపడు కొలత ప్రకారమైనదై యుండేది.

## అన్వయము

### విశ్వాసము విషయమై మనఃపూర్వకంగా పోరాడుట (వచనములు 3, 4)

ప్రతి క్రైస్తవుడు విశ్వాసుల సమూహంలో విధివిహితంగా తలెత్తు విభజనలు, అపార్థములు, మరియు సంఘర్షణలతో వ్యవహరించడానికి ఏదో ఒక విధానమును అభివృద్ధి చేసుకుంటాడు. వారి పూర్తి సమయమును మరియు శక్తిసామర్థ్యములను క్రీస్తు పరిచర్యకై అంకితం చేయుచుండు ప్రబోధకులు మరియు ఉపదేశకుల విషయంలో ఇది మరి ముఖ్యంగా సత్యమై యున్నది. ఇటువంటి కష్టములతో వ్యవహరించుటలో అతిశాయితముగా నుండు రెండు విషయాలున్నాయి. సంఘము లోలోపల తలెత్తు ప్రశ్నలు, అభిప్రాయ భేదాలు, మరియు సంఘర్షణల చేత కొందరు నిరాశాపూరితంగా విసికి వేసారి యున్నారు, గనుక "సహోదరత్వ సమస్యల" గూర్చి గుర్తింపబడదగు వికటమైన భావనతో ముచ్చటించడానికి ముందడుగు వేస్తారు. ఇంకేవైనా చిన్న చిన్న చిల్లర పనులు చేసికోడానికి ఇతరులకు సమయము మరియు శక్తి రెండూ ఉన్నాయి గనుక ఒక చక్కని వాదోపవాదమును వినడానికి వారు వేల కొలది మైళ్ల దూరమైనా పయనిస్తారు. ఒక సమతుల్యమైన చేరువ దిశగా యూదా పత్రిక మనలను నడిపిస్తుంది.

మనలో అనేకుల వలెనే, యాకోబు సహోదరుడైనవాడు తన పాఠకులతో కూడా ఆయన ఆనందానుభూతి చెందుచుండినది, మనకందరికి కలిగెడు రక్షణ గూర్చిన ఒక సందేశమును పంచుకోవాలని ఆయన ఆశపడుచుండెనని చెప్పుతున్నాడు. సమైక్యపరచు గొప్ప క్రైస్తవ్య భావనల గూర్చి మాటలాడటం మరియు రాయటం ఎంతో ప్రసన్నతను కలిగించునది మరియు విశ్వాసమును బలపర్చు విషయమునై యున్నది. ప్రేమ, విమోచన, మరియు రక్షణకు సంబంధించిన గొప్ప ప్రధానాంశములను ప్రదర్శింపగలిగినప్పుడు అబద్ధ బోధకులతో ఎవరైనాగాని కలకలంతో ఎందుకు కలహమాడాలి? అయితే యూదాకు ఇదొక అత్యావశ్యకమైన అంశమై యుండింది. క్రీస్తును గూర్చిన సందేశము రాజీపడుతూ మరియు తన పాఠకులు వారు ఆనందంగా అనుభవించుచుండిన రక్షణ అనుభూతిని కోల్పోవు అపాయంలో ఉండిరని అతడు అర్థంచేసుకున్నాడు.

అది ఆనందాయకము కానిదై యున్నట్టుగా, విశ్వాసం విషయంలో పోరాడాల్సిన సమయములు మరియు సందర్భములు ఉన్నాయి. మనముందున్న పత్రికలో యూదా మనఃపూర్వకంగా పోరాడుతున్నాడు, గనుక తన పాఠకులు సహితం ఈ విషయంలో పోరాడవలెనని ఆయన వారిని విన్నవించుకుంటున్నాడు. ఇవి వ్యక్తిగత అభిప్రాయములను

మించిన వితండ వాదములని అనుకొనబడినవి కావు. యూదా ఘర్షణపడుతుండిన ఉపదేశకుల సందేశము, అది అనుసరింపబడినదైనట్లయితే, క్రైస్తవ్యము యొక్క ప్రాథమిక స్వభావాన్ని అది మార్చివేసేదే.

**ఉదారత వాదము (వచనములు 3, 4)**

భక్తిపూర్వకమైన జీవిత విధానాన్ని ఏదో ఒక సామాన్యమైన నిత్యసూత్రములుగా నిర్బలంచేయడానికి క్రొత్తనిబంధనలోని పరిసయ్యులు ఉన్ముఖులై యుండిరి. వారు తరచుగా యేసును వ్యతిరేకించుచుండినవారై యుండిరి. వారి నియమ నిబంధనలను ప్రభువు ఎక్కువగా పట్టించుకొనలేదు. పరిసయ్యులు తరచుగా "న్యాయబద్ధీకరణవాదులు" అనే ముద్రగలవారై యుండిరి. నిర్వచనాలు ముఖ్యమైనవై యున్నది. న్యాయబద్ధీకరణవాది దేవుడు ఆజ్ఞాపించిన విషయాలను అనుసరించడానికి జాగ్రత్తపరుడైనవాడు కాదు. వాడు సంఘ జీవితంలో లేదా తన సొంత నీతి జీవితంలో తలెత్తు ప్రతి ప్రశ్నకు కఠినముకాని నియమమును కోరువాడై యున్నాడు. ప్రతి విషయానికి సరిపడు నియమ నిబంధనలు లేనట్లయితే, వాడే స్వయంగా కొన్నింటిని రచిస్తాడు. వాడు దేవుని కంటె ఎక్కువ కచ్చితమైనవాడై యుంటాడు.

తెరువబడిన పరిశుద్ధ బైబిలు గ్రంథములు వారి ముందర ఉండగా, క్రైస్తవులు (1) విశ్వాసులు చర్చించుకోడానికి మరియు దృష్టికోణాల్లో గల భేదాలను వ్యక్తంచేయడానికి అనుమతించుటకును, మరియు (2) బైబిలు సంబంధమైన బోధలను అంటిపెట్టుకొని యుండాలని పట్టుబట్టడానికిని మధ్య సమతుల్యమును నిర్వహించుకొనాల్సినవారై యున్నారు. న్యాయబద్ధీకరణ వాదము ఒక నిజమైన శోధనయైయున్నదని మనము గుర్తించవలసినవారమై యున్నాము. ఇది సంఘము ఎదుర్కొనుచున్న వాస్తవమైన అపాయమై యున్నది, కాని మనతో ఏకీభవించని వారిపై కళంకమాపాదించడానికి మనము "న్యాయబద్ధీకరణ వాదమును" ఒక గుర్తింపుగా ఉపయోగించుటలో జాగ్రత్తపరులమై యుండాలి. ఉదాహరణ ప్రభువు భోజనము ప్రతి ప్రభువు దినాన ఆచరింపబడాలని ఒకడు నమ్ముతున్నాడు గనుక, వాడు న్యాయబద్ధీకరణవాది కాదు. ద్రాక్షా రసమును అందించడానికి సంఘము ఒక్క పాత్రను మాత్రమే ఉపయోగించాలని బైబిల్ బోధిస్తుందని నమ్మినవారిని నేను కలుసుకున్నాను. ఇలా నమ్ముతున్నంత మాత్రాన వారు న్యాయబద్ధీకరణవాదులు కాదు. ఒకడు న్యాయబద్ధీకరణవాది కాకుండా కూడా పొరపాటైనవాడై యుండవచ్చు.

"న్యాయబద్ధీకరణ వాదము"తో పాటు, అజాగ్రత్తగా ఉపయోగింపబడు మరొక పదమున్నది. ఒకరిని లేదా ఒక విషయాన్ని క్రైస్తవులు "ఉదారత" యని ప్రస్తావించుట నేను వింటుంటాను, కాని అవతలి వ్యక్తి దేని గూర్చి చెప్తుతున్నాడో నేను తరచుగా నిశ్చయపరుడనై యుండను. లోకంతో సర్దుకొనిపోడానికి సంఘము బైబిలు సంబంధమైన ఉపదేశముల విషయంలో రాజీపడటానికి "న్యాయబదీకరణవాదము" ఒక సహజాభిప్రాయమై యున్నట్లయితే, అది తప్పు. దేవుని సంఘము ఏమి చేయాలి మరియు ఏమైయుండాలి అనే విషయం కంటె, సంఘం గూర్చి మనుష్యులు ఏమనుకుంటున్నారో అనే విషయంలోనే ఎక్కువ ఆసక్తి కలిగియున్న మనస్తత్వమును అది సూచింపవచ్చు. దేవుని వాక్యము మరియు ఆయన మార్గనిర్దేశనములకు గల విలువలను న్యాయబద్ధీకరణవాదము తక్కువగా అంచనా వేస్తుంది.

"న్యాయబద్ధీకరణవాది" అనే పదాన్ని ఉపయోగించు విషయంలో మనము ఎలా జాగ్రత్తపరులమై యుండాలో, అలాగే మనతో ఏకీభవించని ఒకరిని "ఉదారతావాదిగా" ముద్రించు విషయంలో కూడ మనము జాగ్రత్తవహించుచున్నవారమై యుండాలి. ఒకడు న్యాయబద్ధీకరణవాదియై యుండకుండా పొరపాటైనవాడై యుండవచ్చు; అలాగే అతడు ఒక ఉదారతావాదియై యుండకుండా కూడ పొరపాటైనవాడై యుండవచ్చు. ఈ గుర్తుల గూర్చి మనము జాగ్రత్తపరులమై యుండాలి.

న్యాయబద్ధీకరణ వాదమునకు సంబంధించిన సందర్భమును అధ్యయనము చేయు నిమిత్తమై మనము లేఖనములను ఆశ్రయించినప్పుడు, సమాధానం కనుగొనడం కష్టమేమీ కాదు. ఇవ్విధమైన ఆత్మసంబంధమైన రుగ్మతను క్రొత్త నిబంధనలోని పరిసయ్యులు సోదాహరణంగా చిత్రీకరిస్తున్నారు. ఉదారతావాదమునకు సంబంధించిన సందర్భమును అధ్యయనము చేయు నిమిత్తమై మనము లేఖనములను ఆశ్రయించినప్పుడు, సమాధానం కనుగొనడం కొంత మేరకు ఎక్కువ కష్టంగా ఉంటుంది. వీరిని మనము ఎక్కడ కనుగొనగలము? ఉదారతావాదము అని మనము పిలుస్తున్న ఆత్మసంబంధమైన రోగములను ప్రదర్శించు క్రొత్త నిబంధనలోని అబద్ధ బోధకులు ఎవరై యున్నారు? వారిని కనుగొనడానికి నామట్టుకైతే యూదా పత్రికలోని అబద్ధ బోధకుల గూర్చిన వర్ణనలను మించిన మరొక శ్రేష్ఠమైన స్థలం లేదు.

(1) *యూదా ఎదుర్కొన్న అబద్ధ బోధకులు నీతి ప్రవర్తన, మంచితనము, మరియు వ్యక్తిగత నిజాయితీ గూర్చిన క్రొత్త నిబంధన బోధలను నిరాదరించు లేదా రాజీపడు మనస్తత్వంగలవారై యుండిరి.* యూదా "మన దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగపరచు భక్తిహీనుల" గూర్చి రచించాడు (వచనము 4). "అంత్యకాలమునందు తమ భక్తిహీనమైన దురాశల చొప్పున నడుచు పరిహాసకులుందురని" ఆయన చెప్పుచున్నాడు (వచనము 18).

ఆధునిక ప్రపంచం నిశ్చయంగా ఎంత దుర్నీతిమయమై ఉన్నదో, గ్రీకులు మరియు రోమనులు మిళితమై జీవించుచుండిన ప్రపంచం కూడా అలాగే ఉండింది. దొంగతనాలు, నరహత్యలు, విడాకులు, వేశ్యాసాంగత్యము, గర్భస్రావము, పుంమైథునం, సమస్త విధములైన లైంగిక దుశ్శీలము – ఇవన్నీ కూడా మనము ఆవిష్కరించుకున్నవి కావు. ఈ విధమైన ప్రవర్తన ఒక వైపు మనుష్యులను మరొక వైపు దేవునిని శతాబ్దముల తరబడి అగౌరవపరుస్తూనే ఉన్నది. పౌలు ఇలా రాస్తున్నాడు,

> … దేవుడు తుచ్ఛమైన అభిలాషలకు వారిని అప్పగించెను; వారి స్త్రీలు సయితము స్వాభావికమైన ధర్మమును విడిచి స్వాభావిక విరుద్ధమైన ధర్మమును అనుసరించిరి, అటువలె పురుషులు కూడ స్త్రీ యొక్క స్వాభావికమైన ధర్మమును విడిచి, పురుషులతో పురుషులు అవాచ్యమైనది చేయుచుండిరి (రోమీయులకు 1:26, 27ఎ).

ఇంకా, "… చేయరాని కార్యములు చేయుటకు దేవుడు భ్రష్ట మనస్సుకు వారినప్పగించెను. అట్టివారు … సమస్తమైన మత్సరము, నరహత్య, కలహము, కపటము, వైరమనువాటితో నిండినవారై …" అని కూడ పౌలు చేర్చాడు (రోమీయులకు 1:28, 29).

క్రీస్తు సువార్త, సత్యసంధత్వము, వైవాహిక విశ్వసనీయత, మరియు దయను

కోరుతూ, దాని గుర్తింపును అది సాధించుకున్నది. రెండవ మరియు మూడవ శతాబ్దముల కాలములో క్రైస్తవులు హింసింపబడుతూ ద్వేషింపబడుచుండిన సందర్భంలో, వారిలో కొందరు "క్షమాపణలు" రాసారు. ఆ నాటి సామ్రాజ్యంలో, ఉతములైన పౌరులు, క్రైస్తవులే అయియుండిరని వారు వాదించారు.

సంఘము ఎక్కువ కచ్చితంగా ఉన్నట్లయితే అది విశ్వాసులను లోనికి చేర్చుకొనడానికి బదులుగా వారిని లోనికి రానియ్యదు, ఉన్నవారిని వెళ్లగొట్టుతుందని వాదించినవారు తొలి రోజుల నుంచి కూడ ఉన్నారు. యూదా ఎదుర్కొన్నది ఇటువంటివారినే. క్రైస్తవులు దేవునిని ప్రీతిపర్చాలి, ప్రీతిపర్చుతున్నారు, మనుష్యులను కాదని యూదా నొక్కివక్కాణించాడు. దేవుడు నైతిక సత్యసంధత్వమును కోరుతున్నాడు. లోకము దానిని తృణీకరించినట్లయితే, అందులో లోకమును ఎల్లప్పుడు వర్ణించిన విషయముల కంటె వారు ఎక్కువ చేయుచుండునదేమియు లేదు. సంఘము నెలకొల్పబడిన తొలి రోజుల నుంచి ఆధునిక కాలము వరకు కూడ, లోకం పోకడ ఏదైనా సరే దానిని అంగీకరించుటకును, అభ్యసించుటకును ఇష్టపడుచుండినవారు ఉండిరి, ఉంటున్నారు. ఉదారతావాదము యొక్క స్ఫూర్తి ఉంటున్న ఘోరాతి ఘోరమైన పరిస్థితి ఇదే.

క్రీస్తు ఆత్మ పాపముతో రాజీపడదు, కాని మనుష్యులు వారి పాపములో నశిస్తూ తమ హృదయంలో గాయపడినప్పుడు, వారు మార్పునొంది తమ జీవితములను ఒక నూతన పంథాలో సాగజేయవలెనని ఆశించినప్పుడు, క్రీస్తు బోధలను ఆలకించు ఏ ఒక్కరైనను వాటిని తృణీకరించరు. వారి జీవితాల్లోని అనేక విషయాలను "మర్చిపోతే బాగుండునని" ఆశించు క్రైస్తవులు ఎంతో మంది ఉన్నారు. పాపియైన వానిని వాని పాపములనుబట్టి బాధించాలని ఏ క్రైస్తవుడు కూడ ఆశించడు. యూదా కలము నుంచి వెలువడుతున్న మాటలు కృపతో నిండియున్నవి: "సందేహపడువారి మీద, కనికరము చూపుడి; అగ్నిలో నుండి లాగినట్టు, కొందరిని రక్షించుడి; శరీర సంబంధమైనవారి అపవిత్ర ప్రవర్తనకు ఏ మాత్రము నొప్పుకొనక, దానిని అసహ్యించుకొనుచు భయముతో కొందరిని కరుణించుడి" (వచనములు 22, 23).

మారుమనస్సు నొందడానికి కృపాసహితమైన క్షమాపణ ఆవశ్యకమై యున్నది, కాని ఒక క్రైస్తవ భర్త తన భార్య యెడల విశ్వాసఘాతుకమును ప్రదర్శించునప్పుడు లేదా తాను ఆ పని చేయగలడు కాబట్టి అంటూ ఒక క్రైస్తవ వ్యాపారవేత్త జనాలను మోసంచేసినప్పుడు లేదా లైంగిక దుర్నీతి సామాన్యమైన విషయంగా పరిగణింపబడినప్పుడు ఇవేవియు పట్టించుకోదగిన విషయాలు కావని క్రీస్తు అనుచరులు నటించజాలరు లేదా ఊరకనే ఉండజాలరు. మనతో ఏకాభిప్రాయము వెలిబుచ్చనివారి విషయంలో విచక్షణారహితంగా వ్రేలాడదీయడానికి "ఉదారతావాదము" ఒక గురుతు కాదు, కాని అదే సమయంలో అదొక అర్థరహితమైన మాట కూడా కాదు. ఉదారతావాదము క్రైస్తవులను వ్యక్తిగతంగాను మరియు సంఘాలను మొత్తంగాను నాశనము చేయగలదు, చేస్తుంది.

(2) *ఆరాధన, ఐక్యత, మరియు పరిపాలన విషయాల్లో సంఘము దేవుని నిర్దేశనములను అనుసరించుటలో ఏ మాత్రమును ఆసక్తిలేని బోధకులను యూదా ఎదుర్కొన్నాడు.* దేవుని ప్రజలు ఆయనను ఆరాధించు విధానము ప్రాముఖ్యమైన మరియు పట్టించుకొనదగిన విషయమై యున్నది. ఏదైన ఒక విషయంలో దేవుడు తన నిర్దేశనములను

ఇచ్చినట్లయితే, దేవుని ప్రజలు సరిగ్గా ఆయన చెప్పినట్లే చేయవలెను. తప్పుడుదోవ పట్టించు ఉదారతావాదము రాజీపడుటకు ఇష్టపడుతుంది. ఇటువంటి ఉదారతావాదము బైబిలులోని వాక్యములను చదువునప్పుడు, “అందులో ఏముంది, అదంతా భాషానువాదానికి సంబంధించిన విషయమై యున్నది. నీవు నీకిష్టము వచ్చినట్టు వ్యాఖ్యానించు, నేను నా కిష్టమువచ్చినట్టు వ్యాఖ్యానిస్తాను, తేడా ఏమీ ఉండదు” అని చెప్తుంది.

బైబిలును వ్యాఖ్యానించుట లేదా భాషానువాదం చేయుట సరిగ్గా ఒక ఆదేశములుగల కైపొత్తమును చదివినట్లు కాదు, కాని పోల్చిచూచుకోడానికి ఎన్నో ప్రయోజనకరమైన విషయాలున్నాయి. ఇటీవల నేను మా ఇంటి ముందున్న పచ్చికబయలులో (లాన్) జోడించి అమర్చవలసిన కొన్ని కుర్చీలు, బల్లలు మొదలగు గృహోపకరణములను కొన్నాను. ఇవ్వబడిన నిర్దేశనములను జాగ్రత్తగా చదివాను, అయితే ఇంత జాగ్రత్తగా చదివినా, కొన్ని విషయాలను నేను తప్పుగా అనువదించాను గనుక కొన్నింటిని ఊడదీసి మళ్లీ మొదటి నుంచి జోడించాల్సివచ్చింది. ఇవ్వబడిన నిర్దేశనములు నీకు సహాయకరంగా ఉండాలంటే నీవు వాటిని సరియైన విధంగా అనువదించాలి. లాన్‌లో కుర్చీలను మరియు బల్లలను అమర్చడం కంటె జీవితమును కొనసాగించడమనేది ఎంతో ఎక్కువ సంక్లిష్టమైన విషయమై యున్నది, కాని దేవుడు మనకు సరైన ఆదేశములనిచ్చాడు. అవి ఏమైయుండాలని దేవుడు ఉద్దేశించాడో, అవి సరిగ్గా అవే అయియుంటున్నాయి. అది ఏమంత ముఖ్యం కాదు, ఎందుకంటే “అదంతా కేవలం ఒకరు అనువదించడానికి సంబంధించిన విషయమై యున్నదని” సాధికారపూర్వకంగా చెప్పుకుంటూ బైబిలు సంబంధమైన బోధలను మనము కొట్టిపారేయలేము.

సంఘము దేవుని ఆరాధించడానికి సమావేశమైనప్పుడు, అది ఎప్పుడు సమావేశమౌతున్నది మరియు ఈ సమావేశంలో క్రైస్తవులు చేస్తున్న విషయాలేమిటి మొదలగు విషయాలు ప్రాముఖ్యమైనవై ఉన్నాయి. వారి సొంత మార్గములకు వదిలిపెట్టబడినప్పుడు, “ఆరాధనను” అందరు ఎవరికిష్టమైన పదజాలంతో వారు సంబోధిస్తుంటారు. విశ్వాసులు ఆరాధనగా పరిగణించు కొన్ని కార్యకలాపాలున్నాయి, కాని అవి దేవునివి ఏ మాత్రమును ఘనపర్చవు, మహిమపర్చవు. శరీర సౌష్ఠవమును పెంచుకొను (bodybuilders) ఒక జట్టు, ఆరాధన నిమిత్తం సమావేశమైన ఒక పెద్ద సంఘము యెదుట వారి విన్యాసములను ప్రదర్శించడం ఇటీవల నేను దూరదర్శినిలో చూసాను. వారిలో ఒకడు తన చేతులతో సిమెంటు దిమ్మెలు మరియు లావుపాటి బోర్డులను పగులగొట్టుచుండెను. కార్యక్రమము ముగిసిన మీదట జరిగిన ముఖాముఖి సంభాషణలో, అతడు, “సహోదరుడా, నీవు ఏమి చేసినా, దానిని దేవుని మహిమ కొరకు చేయాలి” అన్నాడు. అప్పుడు నేను, ఇతని మాటలు జేబు దొంగలకు లేదా మద్యపానాలు అమ్మే వారికి కూడ వర్తిస్తాయా అని ఆలోచించాను. మనము చేసే ప్రతి పని – అది స్వతఃస్సిద్ధంగా తప్పుడు పని కాకపోయినప్పటికిని – అవశ్యంగా ఆరాధన అవుతుంది. దేవునికి ఏ యే విషయాలు ప్రీతికరమో మనకు ఆయన తెలియజెప్పునట్లు ఆయనను అనుమతించాలి. అపొస్తలులు వారికి బోధించిన విధంగా సంఘము దేవునిని ఆరాధించిందని మనము క్రొత్త నిబంధనలో గమనిస్తాము.

నశించు పాపి రక్షింపబడగల మార్గమును దేవుడు బైబిలులో ఏర్పాటుచేసియున్నాడను భావనను వదిలిపెట్టు ఉదారతావాదులున్నారు. ఉదారతావాదము దాని ఘోరాతి ఘోరమైన

స్థితిలో బైబిలు నందు ఏర్పాటుచేయబడియున్న రక్షణ ప్రణాళికతో రాజీపడుతుంది. నశించువారు రక్షింపబడుటకు చేయాల్సిన విషయం గూర్చి అపొస్తలులు చెప్పినది ముఖ్యమైనదై యున్నది. యేసు తన అపొస్తలులు ఆయన ఆదేశము మేరకు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించవలెనని ఆయన వారికి సెలవిచ్చినప్పుడు ఆయన వారికి తెలియజెప్పిన విషయం ముఖ్యమైనదై యున్నది. తన పాఠకులు "పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తం వారు పోరాడవలెనని" వారిని విన్నవించుకొనుటతో యూదా తన పత్రికను మొదలుపెట్టాడు (వచనము 3).

(3). *మనము "ఉదారత" మరియు "ఉదారతావాదము" అనే పదాలను ప్రయోగించు విధానం విషయంలో తగు జాగ్రత్తపరులమై యుండవలెను ఎందుకనగా "ఉదారత" అనేది ఎల్లప్పుడు చెడ్డది కాదు.* ఇచ్చుటలో ఉదార స్వభావముగలవారమై యుండుట ఒక మంచి విషయమై యున్నది. యేసు ఉదార స్వభావముగలవాడై యుండెను గనుక ఆయన తనను తానే స్వతంత్రంగా ఇతరుల అవసరముల నిమిత్తము అప్పగించుకున్నాడు, అర్పించుకున్నాడు. ఉదార స్వభావముగలవారమై యుండుట అనగా మనము ఇతరుల శ్రేయస్సు గూర్చి ఆలోచించాలని ఆశించుట, ఇతరులు చేసే పనులకు మన ఉత్తమ హృదయంతో కూడిన ఊతనిచ్చుట అనే అర్థమీయవచ్చు. సంఘము ఎలా ఇప్పుడున్న దాని కంటె యింకా ఎక్కువగా "ఉదార స్వభావముగలదై" యుండుటకు ముఖ్యమైన మార్గములున్నాయి. అది కష్టమైన పరిస్థితియై యున్నప్పటికిని, "ఉదారత" విషయంలో దాని ఉత్తమమైన అవగాహన ప్రకారం సమతుల్యమైనవారై యుండుటకు క్రైస్తవులు ప్రయాసపడవలెను. దేవుడు తన ప్రజల నుంచి నైతిక ప్రవర్తనకు సంబంధించినంత వరకు కోరుతున్న విషయాలను లేదా సంఘ జీవితమును సన్మార్గములో నడిపించడానికి ఆయన ఇచ్చిన ఆజ్ఞలను మానివేయునదై స్థానం తప్పిన ఉదారతావాదము, ఇందుకు విరోధమైన అవగాహనయై యున్నది.

*ముగింపు.* క్రైస్తవులలో అధిక సంఖ్యాకులు అప్పుడప్పుడు లోకంలో లేదా సంఘంలో సంభవించు ఆయా సంఘటనలు చూచినప్పుడు వారు మనస్సు చెదరిపోయినవారవుతారు. ఒకడు తాననుకొను విషయాలతో ఏకీభవించని మరొకని గూర్చి ప్రస్తావించునప్పుడు, "ఉదారత" మరియు "న్యాయబద్ధీకరణవాది" అనే పదములను ప్రయోగించుటలో విశ్వాసి జాగ్రత్తపరుడై యుండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ పదములు నిజమైన ఆత్మసంబంధమైన అపాయములను నిర్దిష్టంగా పేర్కొనవలెను.

---

సూచనలు

[1]ఈ సిద్ధాంత పరిశోధన వ్యాసం జాన్ పెయింటర్ చేత పురోభివృద్ధి గావింపబడింది, *Just James: The Brother of Jesus in History and Tradition* (Minneapolis: Fortress Press, 1999). [2]I. Howard Marshall, *New Testament Theology: Many Witnesses, One Gospel* (Downers Grove, Ill.: InterVarsity Press, 2004), 698-99. [3]Ibid., 666. [4]John Stott, *The Contemporary Christian* (Leicester, U.K. :Inter-Varsity Press, 1992), 174. [5]Charles H. H. Scobie, *The Ways of Our God: An Approach to Biblical Theology* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 2003), 460.